ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులా?

- 420 హామీల అమలు, రేవంత్ అరాచకాలపై నిగ్గదీస్తున్న హరీశ్‌రావుపై మరో అక్రమ కేసు
- సర్కారు తీరుపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

నిరుడు ఆగస్టు నుంచి హరీశ్‌పై నమోదైన కేసులు

తేదీ	పోలీస్ స్టేషన్	ఎఫ్ఐఆర్ నంబర్
22-08-2024	యాదగిరిగుట్ట	249/2024
04-10-2024	సైబర్ క్రైమ్‌లో కేసు	జీరో ఎఫ్ఐఆర్
25-10-2024	జీరో ఎఫ్ఐఆర్	కరీంనగర్‌కు బదిలీ
07-11-2024	కరీంనగర్	454/2024
03-12-2024	పంజాగుట్ట	1205/2024
27-02-2025	బాచుపల్లి	177/2025

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరపున బీఆర్ఎస్ నేతలు సంధించే ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానాలు ఇవ్వలేకపోతున్నది. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిగ్గదీయడాన్ని రేవంత్‌రెడ్డి సర్కారు తట్టుకోలేకపోతున్నది. అప్రజాస్వామిక, అరాచక పాలనకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. ఎలాగైనా ప్రతిపక్ష నేతల గొంతు నొక్కాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారు. గట్టిగా ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసుల కత్తి వేలాడదీస్తున్నారు. అందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా అక్రమ కేసులకు తెరలేపారు. కేటీఆర్‌పై ఇప్పటికే పదికిపైగా కేసులు పెట్టిన ప్రభుత్వం.. తాజాగా హరీశ్‌రావుపై మరో కేసు పెట్టింది. దీనిపై బీఆర్ఎస్ నేతలు భగ్గుమంటున్నారు.

ఏడాదిలోనే 6 అక్రమ కేసులు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే హరీశ్‌రావుపై 6 కేసులు పెట్టారు. 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని నిలదీసినందుకు ఓ కేసు, రూ.2 లక్షల రుణమాఫీని అందరికీ వర్తింపజేయడం లేదని విమర్శించినందుకు ఓ కేసు, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అన్నందుకు, రుణమాఫీ చేయకుండా రైతులను మోసగించిన రేవంత్‌రెడ్డి పాపం రాష్ట్ర ప్రజలకు శాపం కాకూడదని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాపపరిహార పూజలు చేసినందుకు, ఎస్ఎల్‌బీసీలో చిక్కుకున్న 8 మంది ప్రాణాలు కాపాడటంలో రేవంత్ సర్కారు విఫలమైందని విమర్శించినందుకు, 14 నెలల కాంగ్రెస్ పాలనలో 4 ప్రాజెక్టులు కుప్పకూలాయని చెప్పినందుకు 5 కేసులు నమోదు చేసిన ప్రభుత్వం.. హరీశ్‌రావు అనుచరులు తనను బెదిరిస్తున్నారని చక్రధర్‌గౌడ్ అనే కాంగ్రెస్ నాయకుడితో ఫిర్యాదు చేయించి ఫిబ్రవరి 27న బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో మరో అక్రమ కేసు బనాయించింది. దీనిపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎన్ని పోలీస్ స్టేషన్లలో ఎన్ని కేసులు పెట్టిస్తావ్ రేవంత్‌రెడ్డి? అని నిలదీస్తున్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని, రేవంత్‌రెడ్డి అప్రజాస్వామిక, అరాచక పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూనే ఉంటామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో, నిజాయితీగా పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని, ఇందిరమ్మ రాజ్యం అంటూ రేవంత్‌రెడ్డి చీకటి రాజ్యం కొనసాగిస్తున్నారని, ఎమర్జెన్సీ పాలన తలపిస్తున్నారని మండిపడుతున్నారు.

ప్రశ్నిస్తున్నందుకే హరీశ్‌రావుపై అక్రమ కేసులు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): నిత్యం ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తున్నందుకే మాజీ మంత్రి హరీశ్‌రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతున్నదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను ఎగ్గొట్టిన ముఖ్యమంత్రిని ఎగవేతల రేవంత్‌రెడ్డి అన్నందుకు, రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై సీఎం ఒట్టేసి మాటతప్పడం రాష్ట్ర ప్రజలకు శాపం కావొద్దని యాదాద్రిలో పూజలు చేసినందుకు, ఎస్ఎల్‌బీసీ ఘటనలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించినందుకు హరీశ్‌రావుపై కేసులు పెట్టారని దుయ్యబట్టారు.

వంశీకృష్ణ అఫిడవిట్‌పై వాదోపవాదాలు

వాంగ్మూలం నమోదుకు పీపీ అభ్యంతరం

హైదరాబాద్/నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు వంశీకృష్ణను చిత్రహింసలకు గురిచేసిన పోలీస్ అధికారులపై దాఖలైన అఫిడవిట్‌పై శుక్రవారం నాంపల్లి కోర్టులో వాడీవేడిగా వాదనలు జరిగాయి. ఆ అఫిడవిట్‌పై పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడం, కౌంటర్ దాఖలుకు అవకాశం కల్పించాలని కోర్టును కోరడంపై నిందితుడి తరపు న్యాయవాది జక్కుల లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నోటీసులు అందుకోకుండానే అఫిడవిట్‌పై పీపీ అభ్యంతరం వ్యక్తం చేయడం చట్టవ్యతిరేకమని మండిపడ్డారు. వంశీకృష్ణను ఉద్దేశపూర్వకంగా ఈ కేసులో ఇరికించి, తీవ్రంగా హింసించిన ఏసీపీ, డీసీపీని కాపాడేందుకు పీపీ ప్రయత్నిస్తున్నట్టు గోచరిస్తున్నదని పేర్కొంటూ.. ఆ అధికారుల వేధింపులపై నిందితుడి వాంగ్మూలాన్ని నమోదు చేయాలని పట్టుపట్టారు. ఈ వాదనలపై 14వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సౌమ్య స్పందిస్తూ.. అఫిడవిట్‌పై పీపీ కౌంటర్ దాఖలు చేసినా అంగీకరించబోనని స్పష్టం చేశారు. పోలీసుల చిత్రహింసలపై పైవేట్ పిటిషన్ దాఖలు చేయాలని నిందితుడికి సూచిస్తూ.. వాంగ్మూలం నమోదుపై విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

రాధాకిషన్‌రావు పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వాయిదా

ఈ కేసును కొట్టేయాలని కోరుతూ రిటైర్డు డీసీపీ రాధాకిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. దీంతో తీర్పును తర్వాత ప్రకటిస్తామని జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం ప్రకటించారు. ఇదే కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు గురువారమే విచారణ ముగించి, తీర్పును వాయిదా వేసింది.

నేటి నుంచి ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ శనివారం ఉదయం 11 గంటల నుంచి ప్రారంభంకానుంది. లోకల్, నాన్‌లోకల్ కోటాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం, గురువారం జీవో జారీకావడంతో శనివారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు లైన్‌క్లియర్ అయ్యింది. టీజీ ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కోకన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ రెండింటికి హాజరయ్యేవారు ఒకేసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఫీజు చెల్లించాక లావాదేవీ నంబర్‌ను జాగ్రత్తగా నోట్‌చేసుకోవాలని తెలిపారు. ఏప్‌సెట్‌ను ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మూడు భాషల్లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు దరఖాస్తు సమయంలో తమ సెల్‌ఫోన్ నంబర్, లేదంటే తల్లిదండ్రులు/సంరక్షకుల సెల్‌నంబర్‌ను పొందుపరచాలని వివరించారు. ఈ-మెయిల్ ఐడీ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎప్‌సెట్ సమాచారాన్నంతా ఆయా మెయిల్ ఐడీకే పంపిస్తామని తెలిపారు.

చెట్లకు ఆధార్ అద్భుతం

గొప్ప ఆలోచనకు శ్రీకారం చుట్టిన మీనాక్షికి కేటీఆర్ అభినందనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): మొక్కలను నాటి పరిరక్షించడమే గాకుండా చెట్లకు ఆధార్‌కార్డును రూపొందించడం అద్భుతమని మాజీ మంత్రి కేటీఆర్ కొనియాడారు. సాంకేతికతను జోడించి చెట్లు తమ చరిత్రను చెప్పుకొనేలా చేయడం గొప్ప విషయమన్నారు. ఇందుకు నాందిపలికిన ముక్కెర గ్రామ మాజీ సర్పంచ్ మీనాక్షిని శుక్రవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ అభినందించారు. భవిష్యత్‌లోనూ ఇదేస్ఫూర్తితో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.

ఒక్ల హోమా వర్సిటీతో ఎంఎల్ఐఆర్‌టీ ఒప్పందం

యూఎస్‌లోని వర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ఒక్ల హోమా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్ రెడ్డి, మర్రి అనుశ్రేయ రెడ్డి

దుండిగల్, ఫిబ్రవరి 28: వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి యూఎస్‌లోని ఒక్ల హోమా విశ్వవిద్యాలయంతో దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఐఆర్‌టీ) ఒప్పందం చేసుకుంది. ఎంఎల్ఐఆర్‌టీ కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం యూఎస్‌లోని ప్రతిష్టాత్మక ఒక్ల హోమా విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఒక్ల హోమా విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ శివరామకృష్ణన్, లక్ష్మీవరహన్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఐఆర్‌టీ, ఒక్ల హోమా వర్సిటీ మధ్య పరస్పర సహకారం కోసం చర్చించారు. ప్రధానంగా అధ్యాపకుల నైపుణ్యాలను పెంపొందించడం, విద్యార్థుల ఉన్నత విద్యకు సహకారం అందించుకోవడం, పరిశోధన తదితర భాగస్వామ్యాలను ఏర్పరచడంపై దృష్టి సారించారు. మార్గదర్శక విజ్ఞాన మార్పిడిని సులభతరం చేయడానికి, పరస్పర పురోగతిని పెంపొందించడానికి ఈ సమావేశం ఉపయోగపడుతుందని మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. వివిధ విభాగాలలో విప్లవాత్మక పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడానికి సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల డైరెక్టర్ అనుశ్రేయ రెడ్డి పాల్గొన్నారు.

దళిత కులాల్లో దేనికీ అన్యాయం జరగొద్దు: మందకృష్ణ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 28 : వందేండ్ల వరకు దళిత కులాల్లో దేనికి కూడా అన్యాయం జరుగవద్దని, ఏ దళిత వర్గం కూడా బాధపడొద్దనే తన తాపత్రయమని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 76 ఏండ్లల్లో అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ ఫలాలు మాలలే అనుభవించారని, దామాషా ప్రకారం మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు దక్కక నష్టపోయారని వాపోయారు. వర్గీకరణ అమలులోకి వస్తే దళితుల్లోని 59 కులాలకు న్యాయం జరగాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.